క్లుప్తంగా

బీటీ రోడ్ల కోసం రూ.13.08కోట్లు మంజూరు

జన్నారం: మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.13.08కోట్లు మంజూరైనట్లు ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ సోమవారం తెలిపారు. పొనకల్ గ్రామ పంచాయతీ గోండుగూడ నుంచి చెరుకుగూడెం వరకు రూ.1.80కోట్లు, కవ్వాల్ రాంతాండా నుంచి సోనాపూర్ తాండా వరకు రూ.4.37కోట్లు, రేండ్లగూడ నుంచి రూప్‌నాయక్ తాండా వరకు రూ.1.91కోట్లు, టీడబ్ల్యూ రోడ్డు చింతగూడ నుంచి లక్ష్మీదేవి ఆలయం వరకు రూ.2.21కోట్లు, తపాలపూర్ టీడబ్ల్యూ రోడ్డు నుంచి మల్లన్న ఆలయం వరకు రూ.1.86కోట్లు, హాస్టల్ తాండా నుంచి నాయకపు గూడ వరకు రూ.93లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో ఈ పనులకు టెండర్లను పిలిచి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు కోరిక మేరకు గ్రామాలాభివృద్ధిలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో మాట్లాడి నిధులు మంజూరయ్యేలా కృషి చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశం పొందటానికి ఈ నెల 19వరకు గడువు పెంచినట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. మొదటి దఫా అడ్మిషన్లు ఈ నెల 10తో ముగియగా, 19వరకు గడువు పెంచారన్నారు. మంచిర్యాల ఐటీఐలో కోపా, ఎలక్ట్రీషియన్, ఫ్యాషన్ డిజైన్, ఫిట్టర్, వెల్డర్‌లో 224సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల కేజీబీవీ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు స్పెషల్ ఆఫీసర్ స్వప్న తెలిపారు. ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ, ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాలు పొందే విద్యార్థులు ఎస్సెస్సీ సర్టిఫికెట్‌తో పాటు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేయాల్సి ఉంటుందన్నారు.

'ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావుపై అర్థం లేని ఆరోపణలు చేయడం జెడ్పీటీసీ దంపతులకు సరికాదని బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ యూత్ అధ్యక్షుడు సామల బుచ్చయ్య అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రగతి నివేదన సభకు జెడ్పీటీసీని ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆహ్వానించలేదని చెప్పడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇటీవల హాజీపూర్‌లో దశాబ్ది ఉత్సవాల్లో జరిపిన చెరువుల పండగకు స్థానిక జెడ్పీటీసీగా ఎందుకు హాజరుకాలేదని, మెడికల్ కళాశాల విషయంలో ఏ ప్రోటోకాల్‌తో సంబురాలు జరిపారని ప్రశ్నించారు. మెడికల్ కళాశాల తాము తీసుకొచ్చామని మంత్రి హరీశ్‌రావుతో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు సోగాల కిష్టయ్య, పెద్దయ్య, తిరుపతి, ఆసాది ప్రవీణ్, సతీశ్, నస్పూరి సతీశ్, బొడ్డు శేఖర్, హరీశ్ పాల్గొన్నారు.

ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు జమ చేయాలి

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల జీతాల నుంచి రికవరీ చేస్తున్న ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులను ఆయా అకౌంట్‌లలో జమ చేయాలని తెలంగాణ నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సోమవారం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రమేశ్‌కు సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, ఉపాధ్యక్షుడు మచ్చెర్ల సతీష్, కార్యదర్శి కదిరి రాజు, నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వర శివపంచాయతన ఆంజనేయ, నవగ్రహ ఆలయ ధ్వజశిఖర యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగవైభవంగా ప్రారంభమైంది. వేదపండితులు దుద్దిల్ల మనోహర అవధాని, గట్టు నవహరిశర్మ, గణపతిశర్మ, నారాయణశర్మ, కిష్టయ్య ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మొదటిరోజు అయిన సోమవారం గణపతి పూజ పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠ, జలాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, మంగళహారతులతో మహిళలు నృత్యం చేస్తూ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.



ధరల సెగ

> 'దినుసు ధరలు దినము జూత్తే దిగులే పుట్టెరో...
> ఈ బజారు బతుకులు పాడుగాను బతకనియ్యయిరో...
> ఓరయ్యో బతకనియ్యయిరో.. ఓరన్నో బతకనియ్యయిరో'

రోజువారి నిత్యావసరాల ధరల తీరును వివరిస్తూ ప్రజాకవి బల్ల కిష్టస్వామి రాసిన ఆ పాట ప్రస్తుత వర్తమాన పరిస్థితులకు అద్దం పడుతోంది. వేసవి తీవ్రతను తలదన్నేలా కూరగాయల ధరలు మార్కెట్లో మండిపోతున్నాయి. కూరగాయలను కొనుగోలు చేయడం దేవుడెరుగు వాటి ధర వింటేనే పేద, సామాన్యులు బెంబేలెత్తుతున్నారు. దినదినం పెరిగిపోతున్న కూరగాయల ధరలతో పోటీపడలేక సతమతమవుతున్నారు. అయినా వంటలకు కూరగాయలు అనివార్యం కావడంతో ధర ఎక్కువైనా కొనుగోలు చేసి తీసుకెళ్లక తప్పడం లేదంటున్నారు వినియోగదారులు. పక్షం రోజుల క్రితం ఉన్న కూరగాయల ధరలు ప్రస్తుతం రెట్టింపయ్యాయి. లోకల్‌గా కూరగాయల ఉత్పత్తి పడిపోవడంతో దూర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి హోల్‌సెల్ వ్యాపారులు అధికధరలకు విక్రయిస్తున్నారు. – బెల్లంపల్లి

- ఎండ తీవ్రతతో పెరుగుతున్న కూరగాయల ధరలు
- కిలోకు గరిష్టంగా రూ.40వరకు..
- ప్రాంతీయంగా పడిపోతున్న సాగు
- ప్రజావసరాలకు అనుగుణంగా ఇతర ప్రాంతాల నుంచి రవాణా

సుదూర ప్రాంతాల నుంచి దిగుమతి..

జిల్లాలో కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. జిల్లాలో 200పై చిలుకు ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నట్లు ఉద్యానవన శాఖ గణాంకాలు స్పష్టం చేస్తుండగా, వాస్తవ రూపంలో పరిశీలిస్తే ఆ సంఖ్య 100ఎకరాల్లోపునే ఉంటుందని చెబుతున్నారు. చేను, చెలకలు, పెరటి భూముల్లో అత్యల్ప మంది రైతులు కూరగాయలు పండిస్తున్నారు. రక్తాన్ని చెమటగా మార్చి పండించిన కూరగాయలకు మద్దతు ధర లభించకపోవడంతో ఏటా కూరగాయల సాగు క్రమంగా పడిపోతోంది. గ్రీన్‌హౌజ్, పాలిహౌజ్‌ల ద్వారా ఎండాకాలంలోనూ కూరగాయలు సాగుచేసేలా రైతాంగాన్ని ప్రోత్సహించాల్సి ఉండగా, ఉద్యానశాఖ అధికారులు తీవ్ర అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. రైతులను చైతన్యపర్చడంలో ముందడుగు వేయలేకపోతున్నారు. ఈ కారణంగా కూరగాయల ఉత్పత్తి పడిపోయి, హోల్‌సెల్ వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లా మదనపల్లి, మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని చిన్వాడ, హైదరాబాద్ బోయిన్‌పల్లి మార్కెట్, సిద్దిపేట జిల్లా వొంటిమామిడి ప్రాంతాల నుంచి ప్రజాఅవసరాలకు అనుగుణంగా రోజువారీగా కూరగాయలను దిగుమతి చేసుకుంటున్నారు.

బెల్లంపల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు (కిలోకు రూ.ల్లో)

కూరగాయలు	15రోజుల క్రితం	ప్రస్తుతం
టమాటా	30	50
కాకరకాయ	40	60
పచ్చిమిర్చి	80	100
చిక్కుడు కాయ	60	80
దొండకాయ	50	60
వంకాయ	20	40
బీరకాయ	60	100
గోరుచిక్కుడు	50	60
బీట్‌రూట్	60	80
క్యారెట్	80	100
క్యాబేజీ	40	60
కొత్తిమీర	100	150
పుదీనా	80	100
ఆలుగడ్డ	30	40

కూరగాయల ధరలు పిరమైనయ్..

కూరగాయల ధరలు మస్తు పిరమైనయ్. దినాం ధరలు ఒక లెక్కన ఉంటలేవ్. రోజు తీర్గా మారుతున్నయ్. గిట్ల దినామొక లెక్కన ధరలు పెరుగుకుంట పోతే పేదలకు మోయలేని భారమైతది. సర్కారు ఇసారం జేసి ధరలు తగ్గించడానికి చర్యలు తీసుకోవాలే. కూలీలు, పేదలకు కష్టం కలుగకుండా సూడాలే. రైతులకు సబ్సిడీపై కూరగాయల విత్తనాలు సరఫరా చేసి, కూరగాయల సాగును ప్రోత్సహిస్తే ఫాయిదా ఉంటది. ధరలు తగ్గుతయ్.
– రాజక్క, గృహిణి, బెల్లంపల్లి

ప్రభుత్వం ఇసారం జెయ్యాలే

కూరగాయలు లేకుండా ఇంట్లో వంటచేసే అవకాశాలు ఏకోశాన ఉండవు. పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కూరగాయలు కొనుగోలు చేయాల్సిందే. దినసరి సరుకు అయిన కూరగాయల సాగును రెట్టింపు చేయడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. రైతులు, కొనుగోలు దారుల పక్షాన ప్రభుత్వం ఇసారం జేసి సముచిత నిర్ణయం తీసుకోవాలి.
– జనార్దన్, చిరు వ్యాపారి, బెల్లంపల్లి

పశుపోషణకు చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

మంచిర్యాలఅగ్రికల్చర్: పశుపోషణ, పశుసంరక్షణకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు చర్యలు తీసుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటక సత్యనారాయణరెడ్డి మాట్లాడారు. పశుపోషణను పెంచాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని, తదితర డిమాండ్లు చేశారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ కమిటీ సభ్యులు చిట్ల భీమయ్యయాదవ్, లక్ష్మినారాయణ, మాలకొండయ్య, తిరుపతి, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'డీసీఎంఎస్ నిర్వాహకులపై చర్యలకు వినతి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం రాపల్లి డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకురాలిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్‌కు స్థానిక రైతులు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్కువ తూకం వేయడమే కాకుండా, రైస్‌మిల్లులకు పంపే సమయంలోనూ అదనంగా తక్కువ కిలోలు వచ్చేలా కేంద్రం నిర్వాహకురాలు తిరుమలతో పాటు రైస్‌మిల్లు యజమానిపై చర్యలు తీసుకుని న్యాయంగా తూకం వేసి డబ్బులు ఇప్పించేలా చూడాలని కోరుతున్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు చిప్పకుర్తి లచ్చయ్య, అప్పాసు సత్తయ్య, కొమిరె మల్లేశ్, పుష్పలత, గట్టయ్య, మిట్టపల్లి భూంరెడ్డి, ఆనె మల్లయ్యలు ఉన్నారు.

దశాబ్ది ఉత్సవాలు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీఓ సబ్దర్ ఆలీ

భీమిని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో ఎంపీఓ సబ్దర్‌ఆలీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న జరగబోవు పల్లెప్రగతి దినోత్సవాన్ని విజయవంతం చేయాలన్నారు. గ్రామపంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని రహదారులకు సున్నంతో లైనింగ్‌లు వేయించాలని, గ్రామ పంచాయతీ కార్యాలయానికి మామిడి ఆకులు, కొబ్బరిమట్టలతో అందంగా అలంకరించుకోవాలన్నారు. జాతీయజెండా ఆవిష్కరించాలని సూచించారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులను హాజరయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ భాస్కర్‌రావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం విజయవంతం చేయండి

కాసిపేట: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించే మహిళా దినోత్సవం నియోజకవర్గస్థాయిలో బెల్లంపల్లి పద్మశాలీ భవన్‌లో నిర్వహించడం జరుగుతుందని మహిళలు, మహిళ ఉద్యోగులు, అంగన్‌వాడీ ఉద్యోగులు, మహిళ ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎంఏ అలీం సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది సమీక్ష సమావేశం నిర్వహించారు. 13న మహిళ దినోత్సవం, 15న పల్లెప్రగతి దినోత్సవం, 17న గిరిజన ఉత్సవం, 19న హరిత ఉత్సవం కార్యక్రమాలు గ్రామపంచాయతీల్లో విజయవంతం చేయాలన్నారు.

సుదర్శన్‌కు విప్లవ జోహార్లు

పాతమంచిర్యాల: సీపీఐ మావోయిస్టు నేత కామ్రేడ్ కటకం సుదర్శన్ 45 సంవత్సరాలకు పైగా నమ్మిన సిద్ధాంతం కోసం చివరిశ్వాస వరకు పనిచేశారని భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు లెనినిస్టు రెవెల్యూషనరీ ఇన్సియేట్ పార్టీ సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు గడ్డం సదానందం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుదర్శన్ కఠినమైన కమ్యూనిస్టు జీవితాన్ని నిజజీవితంలో ఆచరించి నిరూపించారన్నారు. ఆయన అమరత్వానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నామన్నారు.

'అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి'



మాట్లాడుతున్న ఏమాజీ

బెల్లంపల్లి: మండలంలోని ఆకెనపల్లి గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న పేదల భూమిని ఆక్రమించిన అక్రమార్కులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొయ్యల ఏమాజీ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆకెనపల్లి శివారు ప్రాంతం సర్వే నెంబర్ 3పైకి పీలో ఉన్న దుర్గం పోశం అనే వ్యక్తికి చెందిన 2.75ఎకరాల భూమిని ఎమ్మెల్యే చిన్నయ్య అనుచరులు దురాక్రమణ చేశారన్నారు. బాధితుడు దుర్గం పోశం 1950సంవత్సరం నుంచి ఆ భూమిలో సాగుదారుగా ఉన్నాడని తెలిపారు. సాగుదారు చనిపోయిన తర్వాత లంబాడి తండా గ్రామానికి చెందిన ఎమ్మెల్యే అనుచరులు బుక్యరాంచందర్, పరశురాం, కిషన్, శంకర్, రవి అనే వ్యక్తులు కలిసి దుర్గం లింగయ్య అనే వ్యక్తి పేరున అక్రమంగా పట్టా చేయించారని ఆరోపించారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన భూమిని కబ్జా చేయడానికి అక్రమపట్టా చేయించారన్నారు. ఎమ్మెల్యేకు గోడు వెళ్లబోసుకున్నా పట్టించుకోలేదని విమర్శించారు. భూ కబ్జా చేయడం కోసమే మరో వ్యక్తి పేరుపై తప్పుడు పట్టా చేయించారని, వెంటనే ఆ పట్టాను రద్దు చేసి దుర్గం లక్ష్మి పేరుపై పట్టా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లం తిరుపతి, కో కన్వీనర్ రాజులాల్ యాదవ్, కేశవరెడ్డి, బాధిత కుటుంబీకులు దుర్గం లక్ష్మి, ఆమె కొడుకులు దుర్గం రాజయ్య, లక్ష్మయ్య, దుర్గం శ్రీనివాస్, నాగార్జున పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన గంధం రమేశ్

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా బీఆర్‌ఎస్ మాజీ ప్రధాన కార్యదర్శి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు గంధం రమేష్ సోమవారం తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ సమక్షంలో టీడీపీలో చేరినట్లు టీటీడీపీ పార్లమెంట్ అబ్జర్వర్ బి.సంజయ్‌కుమార్ తెలిపారు. టీటీడీపీ రాష్ట్ర కార్యాలయం హైదరాబాద్‌లో రమేష్‌కు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. కార్యక్రమంలో రామగుండం అసెంబ్లీ నియోజకవర్గం కో ఆర్డినేటర్ పెద్దపల్లి సత్యనారాయణ, పాపయ్య, రాజయ్య పాల్గొన్నారు.

తప్పిపోయి.. దొరికాడు



దండేపల్లి: మంచిర్యాలలో ఈ నెల 9న జరిగిన సీఎం సభకు వెళ్లిన దండేపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన మానసిక దివ్యాంగుడు పరందాము తప్పిపోయాడు. ఆ రోజు అతను ఇంటికి రాకపోవడంతో, ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రెండు రోజులు వెతికారు. మంచిర్యాలలో కొండాపూర్ గ్రామస్తులకు సోమవారం కనిపించడంతో, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అతన్ని ఇంటికి తీసుకొచ్చారు. గతంలోనూ పలుమార్లు ఇలానే తప్పి పోయాడని గ్రామస్తులు పేర్కొన్నారు.

'సాయికుంట'ను కబ్జాదారుల నుంచి కాపాడాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎస్పీ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సాయికుంట చెరువును కాపాడాలని బీఎస్పీ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ జోనల్ కన్వీనర్ మద్దెల భవాని మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని తిరుమలగిరి కాలనీ పక్కన గల సాయికుంట చెరువును అభివృద్ధి పేరుతో స్థానిక కౌన్సిలర్ హరికృష్ణ అండదండలతో కొందరు చెరువుమట్టి వేసి చదును చేశారన్నారు. ఈ విషయాన్ని నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణదారులు చెరువు ఎఫ్‌టీఎల్ హద్దు రాయిని తొలగించి, చెరువును ఆక్రమించి, రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారన్నారు. సాయికుంటలో ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లను నిర్మించి చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు విన్నవించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా మహిళా కన్వీనర్ బొడ్డు వినోద, బీఎస్పీ మాజీ జిల్లా అధ్యక్షుడు జాగిరి రాకేష్, మహిళా నాయకురాళ్లు సరిత, రమాదేవి పాల్గొన్నారు.

మురిమడుగులో మెగా వైద్య శిబిరం

జన్నారం: మండలంలోని మురిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలో రాఘవేంద్ర లిటిల్‌హార్ట్స్ పాఠశాల, జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. జగిత్యాలకు చెందిన ప్రముఖ వైద్యుడు రాహుల్, లక్ష్మణ్‌రావు సహకారంతో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆరోగ్యవంతమైన తెలంగాణ కోసం 2కే రన్



రన్నింగ్ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య, కలెక్టర్ సంతోష్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, తదితరులు

బెల్లంపల్లి: ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధన లక్ష్యంగా తెలంగాణ(2కే) రన్ చేపట్టినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం, దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం బెల్లంపల్లిలో 2కే రన్ నిర్వహించారు. డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్యతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. రన్‌లో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, కలెక్టర్ ఇతర అధికారులు పాల్గొని క్రీడాకారులు, యువకులు, విద్యార్థులు, వాకర్స్ తదితరులను ఉత్సాహపరిచారు. పాత బస్టాండ్ ఏరియా సింగరేణి తిలక్ స్టేడియం వద్ద నుంచి ప్రారంభమైన రన్ బజారుఏరియా, కాంటా చౌరస్తా మీదుగా ఏఎంసీ క్రీడా మైదానం వరకు కొనసాగింది. అనంతరం ఏఎంసీ మైదానంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, సాధించిన ప్రగతి, చేసిన అభివృద్ధిని ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలను 21రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 2కే రన్‌ను రోజువారీగా యువత అలవర్చుకోవాలని సూచించారు. పరుగు, వ్యాయామం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 2కే రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, యువజన, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సమ్మయ్య, పోలీసు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోర్లకుంట పోశలింగం(బీపీఎల్), ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఏసీపీ మల్లికార్జున్ తదితర ప్రభుత్వ శాఖల అధికారులు, క్రీడాకారులు, వాకర్స్, యువజన, విద్యార్థులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ(సీఓఈ) గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి ఐనాల భగవత్ ప్రథమ బహుమతి సాధించగా కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విజేతగా నిలిచిన భగవత్‌కు మెమెంటో, నగదు బహుమతిని ప్రదానం చేసి ప్రత్యేకంగా ప్రశంసించారు.



చెన్నూర్‌లో 2కే రన్ ప్రారంభిస్తున్న సీఐ

చెన్నూర్: పట్టణంలో నిర్వహించిన 2కే రన్‌కు విశేష స్పందన లభించిందని చెన్నూర్ సీఐ వాసుదేవరావు అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జలాల్ పెట్రోల్ బంక్ వద్ద 2కే రన్‌ను సీఐ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 2కే రన్ జలాల్ పెట్రోల్ బంక్ నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు ఉత్సాహంగా సాగింది. అనంతరం పలువురు మహిళా పీఈటీలను సీఐ సన్మానించారు. 2కే రన్‌లో చెన్నూర్‌తో పాటు కోటపల్లి, జైపూర్ పోలీసుస్టేషన్‌ల పరిధిలోని క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, జైపూర్ సీఐ రాజు, సీహెచ్‌సీ వైద్యులు సత్యనారాయణ, ఎస్సైలు, ఉపేందర్, చంద్రశేఖర్, రాజేశ్, వెంకటస్వామి, సుబ్బారావు, సౌజన్య, శ్వేత, గంగారాజుగౌడ్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు రామయ్య, ఫణికుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

హెల్త్ రిపోర్టులు అందజేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీ ఆవరణలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ మంచిర్యాల ఆధ్వర్యంలో సోమవారం ఇటీవల నిర్వహించిన ఆరోగ్య శిబిరం రిపోర్టులను అందజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ గట్ల చాజు, కార్యవర్గ సభ్యులు వేముల మధు, స్వామి, సభ్యులు పాల్గొన్నారు.

చింతగూడలో ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామం శివాలయంలో సోమవారం శివలింగం విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరూ భక్తిశ్రద్ధలతో విగ్రహాలతో ఆలయానికి వెళ్లి, పూజారుల మంత్రోశ్చరణల మధ్య ప్రతిష్ఠించారు. బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ కార్యక్రమంలో పాల్గొని అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు మేడ మురళి, నాయకులు నందు నాయక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజావాణి రద్దు

భీమారం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ప్రజావాణిని రద్దు చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణా ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహిస్తున్నా దృష్ట్యా ప్రజావాణిని రద్దు చేశామని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు గమనించాలని కోరారు.

సభ్యత్వ నమోదు

జన్నారం: పద్మశాలీ సంక్షేమ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గాదాసు బాపు, మండల అధ్యక్షుడు చెటుపల్లి గంగయ్య ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు బాపు తెలిపారు.

హైదరాబాద్ తరలిన డీఎస్పీ నాయకులు

జైపూర్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి జైపూర్ మండల డీఎస్పీ నాయకులు తరలివెళ్లారు.

యూనిఫాం అందజేత

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా యూనిఫాం అందించింది. దండేపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వాగతం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): విద్యార్థులకు పూర్తి వసతులు కల్పించగా సోమవారం నుంచి పాఠశాలలు యదావిధిగా పునఃప్రారంభమయ్యాయి. హాజీపూర్ మండలంలోని ముల్కల్ల, గుడిపేట, దొనబండ, రాపల్లి, పడ్తనపల్లి గ్రామాల్లోని జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలు పునఃప్రారంభం కాగా విద్యార్థులకు ఉపాధ్యాయులు స్వాగతం పలికారు.

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

తాండూర్: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. రేచినీ మండల ప్రజాపరిషత్ పాఠశాలలో చదువుతున్న ఇప్ప ఈశ్వరి, దుర్గం శ్రావణి అనే విద్యార్థులు ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతిలో సీటు సాధించినట్లు ఎంఈవో వాసాల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు జయప్రద తెలిపారు. ఆ విద్యార్థులను ఎంఈవో, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

దండేపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి చేరుకున్నాయి. వాటిని మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఎంఈవో రవీందర్ సోమవారం పంపిణీ చేశారు. విద్యార్థులందరికీ వెంటనే పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు.